క్లుప్తంగా

బాలాత్రిపుర సుందరికి పుష్పాభిషేకం


బాలాత్రిపుర సుందరి అమ్మవారు

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీక మాసం అమావాస్య సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి 50 కేజీల పుష్పాలతో పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో మద్దాల వెంకట సతీష్, ఉమా మహేశ్వరి దంపతులు, పట్నాల సాయిదుర్గ, భవాని దంపతులు, పట్నాల బ్రహ్మజీ, గంగాభవాని దంపతులచే అర్చకులు కొమ్ము శ్రీనివాస్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, బాలాత్రిపుర సుందరి మహిళా సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భారీ గోతులతో నరక ప్రయాణం


కొత్తపూసలమర్రు వద్ద భారీ గోతులతో ఆర్అండ్‌బీ రోడ్డు

భీమవరం అర్బన్: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొత్తపూసలమర్రు నుంచి దొంగపిండి వరకు భారీ గోతుల మధ్య ప్రయాణం నరకంగా మారిందని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం గుండా స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, అంబులెన్సులు, చేపల మేత లోడులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల వర్షాలకు రోడ్డు ధ్వంసమై భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో గోతుల్లో వాహనాలు దిగబడి పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు చెబుతున్నారు. అంతే కాకుండా ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే నరకంగా మారిందని త్వరితగతిన రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుకుంటున్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల కిటకిట

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. అయ్యప్ప, భవానీ మాల ధారులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అమ్మవారిని ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ, చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాలకొల్లులో ఉచిత మెగా వైద్య శిబిరం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లయన్స్ ఫెమినా క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరం డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందుండేదని వారితో పోటీగా ఫెమినా క్లబ్ కూడా అదే బాటలో నడవడం అభినందనీయమని అన్నారు. కిడ్నీ, సుగర్, ప్రసూతి, మానసిక, చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధులు, దంత వైద్య నిపుణులు పాల్గొని ఉచిత సేవలందించారు. స్థానిక విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ, సిబ్బంది తమ సేవలందించారు. సుమారు 450 మంది వైద్య సేవలు పొందినట్లు క్లబ్ అధ్యక్షురాలు మాచేపల్లి ఉమ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎస్.రమణి, కె.అన్నపూర్ణ, లయన్స్ ప్రెసిడెంట్ జయభారత్ రెడ్డి, కారుమూరి నరసింహరావు, యిమ్మిడి లలిత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలి


నరసాపురం మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘ సభ్యులు

నరసాపురం రూరల్: గ్రామ, వార్డు సచివాలయాల సమస్యలను పరిష్కారం దిశగా ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగుదామని సంఘ నాయకులు పలువురు పేర్కొన్నారు. నరసాపురం శ్రీవైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్‌లో ఆదివారం నరసాపురం మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం నరసాపురం మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు, అసోసియేషన్ ప్రెసిడెంట్ వై మోహనరావు, వైస్ ప్రెసిడెంట్ ఉమర్ అలీషా, కొప్పాడి శ్రీనివాస్, పులఖండం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎండుగడ్డికి మహా డిమాండ్

- ఒక్క గడ్డిమోపు రూ.25 నుంచి రూ.35
- పశుగ్రాసం కొరతతో పాడి రైతులకు కష్టాలు


వీరవాసరం మండలంలో కట్టలుగా కట్టిన ఎండుగడ్డి

వీరవాసరం: పశుగ్రాసం కొరతతో ఎండుగడ్డికి డిమాండ్ పెరిగింది. వరి సాగులో ధాన్యం దిగుబడితోపాటు పశుగ్రాసం నిండుగా దొరుకుతుంది. రైతులు ధాన్యంతో పాటు పశుగ్రాసాన్ని పశువులకు ఉపయోగించుకుని ఆర్థికంగా లాభపడుతూ ఉంటారు. గతంలో పంటచేలను కొడవళ్లతో కోసి ట్రాక్టర్లతో తొక్కించి మాసూళ్లు చేసుకునేవారు. తద్వారా వచ్చిన గడ్డిని పశువులకు గ్రాసంగా ఉపయోగించుకునేవారు. ప్రస్తుత సీజన్‌లో వరి కోతలకు యంత్రాలను వాడుతుండడంతో పశువులకు ఉపయోగపడే గడ్డి ముక్కలు ముక్కలుగా చేలోనే పడిపోతూ ఉంటుంది. వీటిని పశువుల రైతులు ఒబ్బిడి చేసుకుని మిషన్ల ద్వారా చేలల్లో పడి ఉన్న గడ్డిని మోపులుగా కట్టించుకుని పశువుల శాలలకు తరలించి పశుగ్రాసంగా వినియోగించుకుంటున్నారు. గత నాలుగైదు సంవత్సరాల నుంచి ఒక్కో వరి మోపుకు రూ.15 నుంచి రూ.20 వరకు తీసుకునేవారు. ప్రస్తుత సార్వా సీజన్లో ఒక్కో మోపు రూ.25 నుంచి రూ.35 వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కో ఎకరాకు 50 నుంచి 60 గడ్డి కట్టలు అవుతాయని రైతులు పేర్కొంటున్నారు. ఒక్కో ఎకరాకు అదనంగా రూ.500 నుంచి రూ.600 అదనంగా ఖర్చవుతుందని పాడి రైతులు వివరిస్తున్నారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం వీలును బట్టి మోపుకు మరో రూ.10 నుంచి రూ.15 అదనంగా అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. పశువుల దాణాగా ఉపయోగించే ఉలవలు, జొన్నలు, తౌడు, దోగర రేట్లు విపరీతంగా పెరిగిపోయి నష్టాల బారిన పడుతుంటే. ఇది మరో అదనపు ఖర్చుగా ఉంటుందని పశువుల రైతులు వాపోతున్నారు.

> **పశుగ్రాసం దొరకడం లేదు**
>
> పశువుల పెంపకం నానాటికి ఇబ్బందిగా మారుతుంది. ఓ పక్క దానా ఖర్చులు పెరిగిపోవడం, మరో పక్క పశుగ్రాసం ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. పశువుల పెంపకం అంటేనే భయం భయంగా ఉంటుంది.
>
> కదలి సత్యనారాయణ, పాడి రైతు, వీరవాసరం

ఐదుగురు పందెం రాయుళ్ల అరెస్ట్

పాలకోడేరు: పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం ఎస్సై మంతెన రవి వర్మ తన సిబ్బందితో కలిసి పాలకోడేరు శివారు ఏఎస్ఆర్ నగర్ సమీపంలో కోడి పందేల స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో గండికోట మావుళ్లు, మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి కోడిని, కత్తిని, రూ.1550 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై మంతెన రవివర్మ తెలిపారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యుడు

కాళ్ల: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న దొడ్డనపూడి గ్రామానికి చెందిన యువకుడికి వైద్య ఖర్చుల నిమిత్తం సర్పంచ్ కొల్లి సుబ్బారావు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. అతడికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం తన బాస్విని చారిటబుల్ ట్రస్టు ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా బాధితుడి కుటుంబ సభ్యులు సర్పంచికి కృతజ్ఞతలు తెలిపారు.

నీరుగారిన అన్నదాత ఆశలు

- భయపెడుతున్న ఫెంగల్
- నేలకొరిగిన వరి చేలు


తుంపర్ల వర్షంలోనే పట్టుబడి పడుతున్న రైతులు


తుంపర్ల వర్షంలోనే పట్టుబడి పడుతున్న రైతులు

ఆకివీడు: ప్రకృతి దాడికి అన్నదారి ఆఖరి ఆశలు కూడా తుడిసిపెట్టుకుపోయినట్లు అయింది. ఫెంగల్ తుఫాన్ అన్నదాతల్ని అతలాకుతలం చేసింది. ఖరీఫ్ సాగు ఆది నుంచి తుఫాన్, భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టానికి గురి కాగా, మిగిలి ఉన్న వరి పంటను ఫెంగల్ గల్లంతు చేస్తోంది. మరో పది, పదిహేను రోజుల్లో కోతకు వచ్చే వరి చేలన్నీ నేలకొరిగాయి. నిండు కంకులతో ఉన్న వరి దుబ్బులు తెరచాపను తలపిస్తున్నాయి. తయారైన వరి చేలల్లోని కంకులకున్న ధాన్యం గింజలు నేలపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నేలకొరిగి వరి మొక్కల మొదళ్లు పూర్తిగా విరిగిపోయాయని, పైకి లేపి కట్టినా ఫలితం దక్కదని వాపోతున్నారు. ఇప్పటికే అధిక పెట్టుబడులు పెట్టి చేతికి దక్కుతుందనుకున్న తరుణంలో ప్రకృతి మళ్లీ విరుచుకుపడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తమను కనికరిస్తేనే దాళ్వా సాగుకు వెళ్లగలమని చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే మాకు అప్పులు ఇచ్చేవారు కూడా ఉండరని, బ్యాంకుల అప్పులు తీర్చలేని పరిస్థితి నెలకొందంటున్నారు. దాళ్వా సాగుకు పుస్తెలమ్ముకుకోవాల్సిందేనని వాపోతున్నారు. నియోజకవర్గంలోని వేలాది ఎకరాల పంట చేతికి అంది వచ్చి, మాసూళ్లకు సిద్ధంగా ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే రాసులపైన కూడా పలు గ్రామాల్లో ధాన్యం ఉంది. ఫెంగల్ మరింత ఉద్ధృతంగా వస్తే ఒక్క గింజ కూడా దక్కదంటున్నారు. మండలంలో ఇప్పటికే వరి కోతలు పూర్తయిన రైతులు ధాన్యం ఒబ్బిడి చేసే పనిలో నిమగ్నమయ్యారు. కోతలు కోయని రైతులు తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు.

> **పుట్టెడు దుఃఖంలో రైతులు**
>
> 
>
> ప్రకృతి రైతులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చింది. ఆర్థికంగా కోలుకోలేని స్థితి కల్పించింది. ఎకరాకు రూ.70 వేలు పెట్టుబడి పెట్టాం. కౌలుకు చేస్తున్న నాలుగు ఎకరాలు పూర్తిగా పోయింది. నీళ్ల బయటకు పంపించినా ఫలితం ఉండదు. సార్వా పోయింది. పెట్టుబడులకు అప్పులు చేశాం. అవి తీర్చలేదు. మళ్లీ పెట్టుబడులకు అప్పు ఎవరిస్తారో అర్థం కావడంలేదు. దాళ్వా సాగుకు పుస్తెలు అమ్ముకుని పెట్టుబడులు పెట్టక తప్పదు. సాగు మాత్రం ఆపలేం, ప్రభుత్వం ఆదుకోవాలి.
>
> రాజనాల వెంకటరత్నం, రైతు, ఆకివీడు

పాఠశాలల్లో పూలే విగ్రహాలు నెలకొల్పాలి

కాళ్ల: భావితరాలకు మహనీయుల చరిత్ర తెలిజేయాలంటే ముఖ్యంగా ప్రతి పాఠశాలలో వారి విగ్రహాలు నెలకొల్పాలని, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిభా పూలేలు శతాబ్దాల క్రితమే విద్య వ్యవస్థలో పలు సంస్కరణలు చేశారని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సంఘసేవకులు చెరుకువాడ రంగసాయికి జ్యోతిరావు పూలే విగ్రహాలు అందించారు. ప్రస్తుతం పెదకాపవరం, జక్కరం, పాలకోడేరు పాఠశాలల్లో ఈ విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. క్షత్రియ కార్పొరేషన్ వేగేశ్న కనకరాజుసూరి, కొత్తపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారికి జిల్లా అవార్డు


అవార్డు అందుకుంటున్న వైద్యాధికారి డాక్టర్ సాయిచంద్ర

ఉండి: మండల వైద్యాధికారి డాక్టర్ బి.సాయిచంద్రకు జిల్లా అవార్డు లభించింది. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రం భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అవార్డుకు ఎంపిక చేశారు. పీహెచ్‌సీ ద్వారా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమ నిర్వహణకు చేసిన విశిష్ట కృషికిగాను డాక్టర్‌తో పాటుగా ల్యాబ్ టెక్నీషియన్ పి.శ్రీదేవికి డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మహేశ్వరరావు, అడిషినల్ డీఅండ్‌హెచ్‌ఓ భానునాయక్, ఏఆర్‌టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోవింద్‌బాబు సంయుక్తంగా అవార్డును అందజేశారు.

ఏడున తల్లిదండ్రుల సమావేశం

ఆకివీడు: ఈ నెల 7వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల మెగా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఏ.రవీంద్ర ఆదివారం తెలిపారు. అదే రోజు విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగెస్ కార్డులను విడుదల చేస్తారన్నారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, సామర్థ్యం, లోటు పాట్లు, వెనుకబాటుతనం, విద్యార్థుల ఆరోగ్య రిపోర్టు, ఆటలు, పాటలు తదితర అంశాలతో కూడిన హోలిస్టిక్ ప్రోగెస్ కార్డులు తల్లిదండ్రులకు ఇచ్చి సమగ్ర పరిశీలన చేస్తారని చెప్పారు. విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందిస్తామన్నారు.

క్రిస్మస్ సంబరాలు ప్రారంభం


చర్చి వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ స్టార్

ఉండి: మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ సంబరాలు ప్రారంభమయ్యాయి. ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో భారీ క్రిస్మస్ స్టార్‌ను క్రేన్ సహాయంతో ఏర్పాటు చేశారు. పేరిష్ పాస్టర్ రైట్ రెవరెండ్ మేషక్ సతీష్‌కుమార్, సంఘ సీఆర్ పి.కరుణాకర్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగకు ప్రత్యేకం స్టార్ అని తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, యూత్ ప్రతినిధులు, సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాదివాడ మల్లన్నకు లక్ష బిల్వార్చన


మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం చేస్తున్న భక్తులు


మల్లేశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించిన దృశ్యం

ఆకివీడు: కార్తీకమాసం ఆఖరి రోజు ఆదివారం శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునే స్వామికి అభిషేకాలు నిర్వహించారు. స్థానిక మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామికి లక్ష బిల్వార్చన పూజ చేశారు. తొలుత అఖండ అన్నాభిషేకం నిర్వహించారు. అర్చకులు లంక దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో హోమం చేశారు. స్థానిక రాజ రాజేశ్వరి సహిత మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, లలితా పారాయణం నిర్వహించారు. పిల్లల మర్రి అగ్రహారంలోనూ, ధర్మాపుర అగ్రహారంలో, భీమేశ్వరస్వామి ఆలయంలో, కోళ్లపర్రులోని కాశీ అన్నపూర్ణాదేవి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

స్వాములకు ఉచిత బిక్ష


బిక్షలో పాల్గొన్న స్వాములు

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామ శివాలయంలో ముత్యాల రమాకాంతమ్మ, రత్నమాణిక్యం కమ్యూనిటీ హాలులో స్వాములకు ఉచిత బిక్ష నిరంతరం కొనసాగుతోంది. ఈ ఏడాది 75 రోజుల పాటు ఉచిత బిక్షను ప్రతీ రోజూ 300 నుంచి 500 మంది స్వాములకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు, గురుస్వామి నూకల రామదాసు ఆదివారం తెలిపారు. అయ్యప్ప, భవానీ, శివ, గోవింద మాలాధారులు బిక్షకు హాజరవుతున్నారన్నారు. దాతల సహకారంతో ఉచితంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించామన్నారు. కార్యక్రమంలో స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో నిర్వహించారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో మొదటి బహుమతి పొందిన సుమారు 100 మంది బాలబాలికలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవ సభకు ఆనంద గ్రూప్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కేజీఆర్ఎల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్రాజీ మాట్లాడుతూ గీతా పఠన వలన విద్యార్థుల్లో మానసిక శక్తి పెరిగి ఉన్నత ఆలోచనలు కలుగుతాయన్నారు. ఈ పోటీలకు గోపాల శర్మ, సంకశారద, తమ్మన రామక్ష్మి, మౌళి లత, బొండాడ ఇందిరా, పెరుమాల ప్రతిమ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన 18 మంది బాలబాలికలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ అధ్యక్షుడు మడిపల్లి శేఖర్, మిషన్ ఆచార్యులు బ్రహ్మచారిని ఈశాన్య చైతన్య పాల్గొన్నారు.

నూతన శోభతో సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

ఆకివీడు: స్థానిక పురాతన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ తరువాత వచ్చిన మొట్టమొదటి షష్ఠి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో కమిటీ అధ్యక్షుడు నేరెళ్ల రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, జగ్గరోతు విజయ్‌కుమార్, మన్నే పోతరాజు, రామశాస్త్రి, మోరా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించామన్నారు. ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు భూమి పూజ చేశారని చెప్పారు. అభివృద్ధి కమిటీ ఏర్పడి కమిటీ అధ్యక్షుడిగా నేరెళ్ల రామకృష్ణ వ్యవహరించి, ఆలయాన్ని సుందరంగా నిర్మించారు.

ఐదు రోజుల షష్ఠి

గతంలో ఒక్క రోజు మాత్రమే నిర్వహించే షష్ఠి ఉత్సవాలను ఐదు రోజులు నిర్వహించాలని ఆలయ అభివృద్ధి కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఆరో తేదీ ఉదయం గోపూజ, సాయింత్రం స్వామి వార్ల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఏడో తేదీన అభిషేకాలు, తెప్పోత్సవం, అఖండ అన్నసమారాధన, ఎనిమిదో తేదీన వేలాయుధ పూజ, పవళింపు సేవ, తొమ్మిదో తేదీన స్వామి వారి గ్రామోత్సవం, పదో తేదీన స్వామి వారికి విశేష కావిడి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, కుంకట్ల దానయ్య, సత్యనారాయణ, వాడపల్లి మోహన్, కుంచాడ బాబ్జీ, అర్చకులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ రోగుల్లో ఆత్మస్థైర్యం నింపాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ భానూ నాయక్

భీమవరం (ప్రకాశంచౌక్): హెచ్ఐవీ సోకిన వ్యక్తులపై వివక్ష చూపకుండా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. భీమవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా ఏపీ శాక్స్ ఐఈసీ కరపత్రాలను జిల్లా అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ భాను నాయక్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భానూ నాయక్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండాలన్నారు. ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీ సోకినవారు తప్పనిసరిగా టీబీ తదితర వైద్య పరీక్షలు చేయించుకుని క్రమం తప్పకుండా ఏఆర్టీ మందులు వాడాలన్నారు. ఈ సంవత్సరం నినాదం హక్కుల మార్గాన్ని అనుసరించండి. నా ఆరోగ్యం నాహక్కు స్లోగన్‌తోముందుకు వెళ్లాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విశిష్ట వైద్య సేవలు అందించిన వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు 40 మందికి ప్రశంసా పత్రాలు, బహుమతులను ప్రదానం చేశారు. భీమవరం ఏఆర్టీ సెంటర్ నుంచి బెస్ట్ అప్రిషియేషన్ అవార్డును కౌన్సెలర్లు డి.ప్రభాకరరావు, బి.పూర్ణేంద్ర, ఫార్మసిస్ట్ ఎస్.శ్రావణి, ఎల్టీ ఏసేబురాజు, సీసీ వెంకటేశ్వరమ్మ అందుకున్నారు. భీమవరం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో 50 మందికి పోషకాహార కిట్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అందించారు. కార్యక్రమంలో ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ వి.రాంబాబు, షేర్ ఇండియా పీవో జి.జగదీష్, కెవైఎస్ ఎస్ పీడీ అర్చన, పాజిటివ్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ కముజు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వీధికెక్కిన బెల్ట్ షాపుల వ్యవహారం

నరసాపురం రూరల్: సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బెల్ట్ షాపులను ప్రోత్సహించబోమని ఒక వైపు చెబుతుంటే మరో వైపు స్థానిక ఎమ్మెల్యే నాయకర్ భరోసా ఉందని చెబుతూ నరసాపురంలో జనసేన ముఖ్యనేత బెల్ట్ షాపులకు సరుకు సరఫరా చేసి కమీషన్ తీసుకుంటానంటూ బాహాటంగా చెబుతున్నాడు. ఈ వ్యాఖ్యలు వివిధ మాధ్యమాల్లో వైరల్ అవడంతో నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. బెల్టుషాపు పాడుకున్న వ్యక్తి బాటిల్‌పై రూ.20 అదనంగా అమ్మి రూ.10 తనకు చెల్లించాలని ఆ జనసేన నాయకుడు ఆదేశాలిస్తున్నాడు. తనకు ప్రజా ప్రతినిధి అండ ఉందని స్పష్టంగా అమ్మకందారులందరికీ అర్థమయ్యే రీతిగా చెబుతున్నాడు. గత కొంత కాలంగా స్థానిక జనసేన శాసన సభ్యుడిపై నియోజకవర్గంలో అవినీతి ఆరోపణలపై విస్తృతంగా ప్రచారం సాగుతుంది. అయితే ఈ విషయాలను జనసేన నేతలు ప్రత్యర్థుల దుష్ప్రచారమని కొట్టి పారేశారు. అయితే ప్రస్తుతం బెల్టుషాపుల కథ తెరపైకి రావడంతో గతంలో ఎదుర్కొన్న ఆరోపణలు కూడా వాస్తవమే కదా అని చర్చ కూడా మొదలైంది

ముగిసిన కార్తీకమాస పూజలు

యలమంచిలి: కార్తీకమాసం చివరి రోజు ఆదివారం శివ, కేశవ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని నందీశ్వరుని వద్ద, ధ్వజ స్తంభాల వద్ద దీపాలు వెలిగించారు. కార్తీకమాస అమావాస్యను పురస్కరించుకుని మేడపాడు శివాలయంలో అర్చకులు బాదంపూడి సత్యనారాయణమూర్తి అభిషేకం చేశారు. యలమంచిలి కేశవస్వామి ఆలయంలో అర్చకులు వాడపల్లి గోపి కృష్ణమాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.